




దంచికొడుతున్న ఎండలు

పదిహేను రోజులుగా చల్లబడిన భానుడు రెండు, మూడు రోజులుగా భగభగలాడుతున్నాడు. ఉదయం ఎనిమిది గంటలకే ఎండలు దంచి కొడుతుండటంతో జనాలు విలవిల్లాడుతున్నారు. శుక్రవారం ఉష్ణోగ్రతలు పెరగడంతో మధ్యాహ్న సమయంలో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చే వారు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా

హిందూ ఏక్తాయాత్ర కరపత్రాలు, పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 14న కరీంనగర్‌లో నిర్వహించే హిందూ ఏక్తాయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్, స్టిక్కర్, కరపత్రాలను శుక్రవారం ఎస్సారార్ కళాశాల మైదానంలో బీజేపీ పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, బీజేపీ నాయకులు బండ రమణరెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. హిందువుల ఐక్యతను చాటి చెప్పేందుకు ఏక్తాయాత్రకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాల మురళీ, రాగి సత్యనారాయణ, ఈరెడ్డి తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులను శుక్రవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుమ్మ ఆనందం అభినందించారు. పాఠశాలకు చెందిన పదో తరగతి ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు 24కు 24 మంది పాస్ కాగా, తెలుగు మీడియంలో 9 మందికి 8 మంది పాసైనట్లు తెలిపారు. ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్.లక్ష్మి, ఉపాధ్యాయులు రాజరత్నం, వేణుగోపాల్‌రావు, గంగారాం, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): పదో తరగతి ఫలితాల్లో 10జీపీఏ, 9 జీపీఏతో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. అదే విధంగా పిల్లలను కష్టపడి చదివించిన వారి తల్లిదండ్రులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని నాయీబ్రాహ్మణ విద్యార్థులు గర్శకుర్తి నర్సయ్య నంబర్ 9440684602కు ఈనెల 15లోపు వివరాలు తెలపాలని వివరించారు.

'డాక్టర్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి'

కరీంనగర్‌టౌన్: కేరళలోని కొల్లాం మెడికల్ కాలేజ్ వైద్యశాలలో జూనియర్ డాక్టర్ వందన దాస్‌పై దాడి చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐఎంఏ కరీంనగర్ అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్, కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసు కస్టడీలో చికిత్స కోసం వచ్చిన వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైద్యులపై ఇలాంటి హింసాత్మక సంఘటనలు దేశంలో వివిధ ప్రాంతాల్లో పునరావృతం కావడాన్ని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణలోని నిమ్స్ వైద్యశాలలో రెసిడెంట్ డాక్టర్‌పై దాడి చేసిన వారిని కూడా కఠినంగా శిక్షించాలని, లేకుంటే ఇలాంటి వరుస సంఘటనలు డాక్టర్ల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: సబ్‌స్టేషన్‌లలో నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా కరీంనగర్‌లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11కేవీ బ్యాంక్ కాలనీ, వావిలాలపల్లి, అంబేడ్కర్‌నగర్, టవర్‌సర్కిల్, వాటర్ వర్క్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. అదేవిధంగా 33/11కేవీ భగత్‌నగర్, ఉజ్వలపార్కు, పద్మనగర్, సప్తగిరికాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

రూరల్ డివిజన్‌లో..

విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 కేవీ కొత్తపల్లి, బొమ్మకల్, మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్, రేకుర్తి, శాతవాహన యూనివర్సిటీ, నగునూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్‌రూరల్ ఏడీఈ కొలుపుల రాజు తెలిపారు.

8 పోస్టులు.. విధుల్లో ముగ్గురు!

- ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పోస్టుమార్టంకు సిబ్బంది కొరత
- మూడు నెలలకోసారి డ్యూటీలు మార్పు
- 24 గంటలు ఒక్కరితోనే నెట్టుకొస్తున్న వైనం
- స్వీపర్లను కేటాయించని అధికారులు
- పని భారంతో అనారోగ్యం పాలవుతున్న సిబ్బంది



కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని పోస్టుమార్టం గది

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పోస్టుమార్టం సిబ్బంది కొరత వేధిస్తోంది. నగరంతో పాటు చుట్టుపక్కల ఎక్కడా హత్యలు, ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాద మృతులు, గుర్తుతెలియని శవాలు, ఏవైనా ఇక్కడికి పోస్టుమార్టంకు రావాల్సిందే. గతంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మాత్రమే పోస్టుమార్టం చేసేవారు. ఈ నిబంధనలను రెండేళ్ల క్రితమే సవరించారు. చనిపోయిన వారి బంధువులు ఆసుపత్రుల్లో నిద్రాహారాలు లేక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 24 గంటల పాటు పోస్టుమార్టం చేసేలా నిబంధనలు అమలు చేశారు. అప్పటి నుంచి రాత్రి వేళ కూడా ఎల్‌ఈడీ లైట్ల వెలుతురులో పోస్టుమార్టం చేస్తున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వార్డుబాయ్‌లు 8 మంది విధుల్లో ఉన్నారు. వీరందరూ పోస్టుమార్టం విధులు నిర్వహించాలి. కానీ ఇందులో ఓ ఇద్దరు రిటైర్‌మెంట్‌కు దగ్గర ఉండగా, ఒకరు డెంటల్ విభాగంలో, మరొకరు మద్యం మత్తులో ఉంటున్నారనే కారణంతో వారికి విధులు కేటాయించడం లేదు. దీంతో పోస్టుమార్టం విధులకు నలుగురే మిగిలారు. వీరు ఒక్కొక్కరు మూడు నెలల చొప్పున డ్యూటీలు చేస్తారు. అయితే ఈ నలుగురిలో ఒకరు తన వంతు డ్యూటీ రాగానే చెప్పాపెట్టకుండా అప్‌స్కాండ్ అవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. లీవు పర్మిషన్ లేకుండానే నెలల తరబడి గైర్హాజరు కావడం, విధులకు వచ్చినా తనకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయంటూ తప్పించుకోవడం పరిపాటిగా మారింది. ఇందుకు అధికారులు కూడా వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం అతని డ్యూటీనే కొనసాగుతుండగా, రెండు నెలల నుంచి చెప్పాపెట్టకుండా విధులకు ఎగనామం పెడుతున్నట్లు తెలిసింది. దీంతో ఉన్న ముగ్గురిలో ఒకరు బలవుతున్నారు.

పెరుగుతున్న పనిభారం

నలుగురిలో ఒకరు విధులకు హాజరు కాకపోవడంతో ఇప్పటివరకు చేసిన వారికే అధికారులు మళ్లీ మళ్లీ డ్యూటీలు వేస్తున్నారు. దీంతో పనిభారం పెరుగుతూ రెగ్యులర్‌గా విధులు నిర్వహించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇక 24 గంటలు పోస్టుమార్టం అమలులోకి వచ్చిన తర్వాత మరింత పనిభారం పెరిగిందని సిబ్బంది వాపోతున్నారు. ఉదయం డ్యూటీకి వచ్చిన వారు సాయంత్రం వెళ్లి పోతే రాత్రి డ్యూటీలో ఉండే వార్డుబాయ్‌లే పోస్టుమార్టం విధులు నిర్వహించాల్సి వస్తుండడంతో రెండు పనులు చేయలేక సతమతమవుతున్నారు.

స్వీపర్లను కేటాయించని వైనం

పోస్టుమార్టం డ్యూటీలో ఉండే వార్డుబాయ్ తాళం తీసుకోవడం నుంచి తిరిగి మూసి వేసే వరకు అన్ని పనులు ఒక్కరే చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో ఎక్కువ సంఖ్యలో మృతదేహాలు వచ్చినప్పుడు, కుళ్లిన బాడీలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. వీరికి స్వీపర్లను కూడా కేటాయించకపోవడం వల్ల 24 గంటలు ఒక్కరితోనే నెట్టుకురావాల్సి వస్తుండడంతో అనారోగ్యాల పాలవుతున్నామని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం



పోస్టుమార్టం చేసేందుకు సిబ్బంది తక్కువగా ఉన్నారు. సిబ్బంది కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం ఎంఎన్‌వో రిక్రూట్‌మెంట్‌లు జరగడం లేదు. ఉన్న సిబ్బందితోనే పనిచేయించాల్సి వస్తోంది. గైర్హాజరయ్యే వారికి అనారోగ్య సమస్యలుంటే మెడికల్ లీవు పెట్టుకోమని చెప్పాం. సిబ్బంది కేటాయింపు జరిగితే ఇబ్బందులు తొలగిపోతాయి.

– డాక్టర్ కృష్ణప్రసాద్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్

కాజ్‌వే కష్టాలకు చెక్



కొత్తపల్లి-వెలిచాల బైపాస్‌రోడ్‌లో మునిగిన లోలెవల్ వంతెన (ఫైల్)

- రూ.4.40 కోట్ల ఎఫ్‌డీఆర్ నిధులతో హైలెవల్ వంతెన
- నేడు భూమిపూజ చేయనున్న మంత్రి గంగుల కమలాకర్

కొత్తపల్లి: కొత్తపల్లి శివారులోని కరీంనగర్-జగిత్యాల బైపాస్‌పై గల కాజ్ వే కష్టాలు తీరనున్నాయి. కొత్తపల్లి-వెలిచాల రోడ్డుపై ఉన్న లో లెవల్ వంతెనపై తరచూ చోటుచేసుకుంటున్న కష్టాలు ఇక తీరనున్నాయి. కాజ్‌వేతో కష్టాలు తప్పడం లేదు.. వానలు పడితే చాలు వరదలతో లో లెవల్ బ్రిడ్జి మునుగుతుండటంపై ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పలుమార్లు 'సాక్షి' కథనాలు ప్రచురించడంతో స్పందించిన ప్రభుత్వం ఫ్లడ్ డ్యామేజ్ రోడ్స్ (ఎఫ్‌డీఆర్) కింద రూ.4.40 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రోడ్లు, భవనాలు శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతమున్న లోలెవల్ వంతెనను హైలెవల్ వంతెనగా నిర్మించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ వంతెన నిర్మాణంతో బైపాస్‌పై ప్రయాణానికి అడ్డంకులు తొలగనున్నాయి. భారీ వర్షాలతో ఎగువ నుంచి వస్తున్న వరద నీరు లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తుండటంతో ప్రయాణానికి తరచూ ఆటంకం కలిగేది. వంతెన మునగడంతో ఈ మార్గం గుండా రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు ఎదురయ్యేవి. భారీ వరదలకు ఈ వంతెనపై వెళ్తున్న కారు, ఇతర వాహనాలు కొట్టుకుపోయిన సంఘటనలున్నప్పటికీ ఎలాంటి ప్రమాదాలు జరగకపోవడం సంతోషకరం. వర్షాలు కురిసినప్పుడల్లా ఈ రహదారిపై ప్రయాణం కష్టసాధ్యంగా తయారైంది. ఈ బైపాస్ గుండా జగిత్యాల వైపు నుంచి వరంగల్, పెద్దపల్లి, రామగుండం, గోదావరిఖని, సిద్దిపేట, హైదరాబాద్, హుజురాబాద్ వైపు..అటు వైపు నుంచి జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఖానాపూర్, నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ బైపాస్‌పై ఎత్తుగా వంతెన నిర్మించి ప్రయాణానికి ఆటంకం లేకుండా చూడాలన్న ప్రయాణికుల కోరిక మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తమవుతోంది.

నేడు మంత్రి గంగుల భూమిపూజ

కొత్తపల్లి శివారు కొత్తపల్లి-వెలిచాల బైపాస్‌పై రూ.4.40 కోట్ల వ్యయంతో నిర్మించే హై లెవల్ వంతెనకు శనివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ భూమిపూజ చేయనున్నారు. ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఈ కాజ్‌వే నిర్మాణానికి పునాది పడుతుండటంపై ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చిత్ర కథ — ప్రమాదకరంగా బావి



కరీంనగర్ మండలంలోని జూబ్లీనగర్ గ్రామ ప్రాంతంలో రోడ్డుకు ఆనుకోని బావి తవ్వారు. ఇరువైపుల ఎటువంటి సూచికలు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. అధికారులు గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

కరీంనగర్‌టౌన్: జిల్లాలోని గర్భిణులందరికీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఆపరేషన్ ద్వారా ప్రసవాలు నిర్వహిస్తున్న ఆసుపత్రులు, ప్రసవాలపై దృష్టి సారించి తనిఖీలు నిర్వహించాలని అన్నారు. అదేవిధంగా వందశాతం వ్యాధినిరోధక టీకాలు అందేలా చూడాలని సూచించారు. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలందరికీ అంగన్‌వాడీ కేంద్రాల వద్దే బాలామృతం అందించాలని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పనులు నిర్వహించే ప్రదేశాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి, జిల్లా సంక్షేమ అధికారి సబిత, జిల్లా ప్రధాన ఆసుపత్రికి సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్, వైద్యులు, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ బిల్లుల కేంద్రాన్ని తొలగించడం సరికాదు'

కరీంనగర్: నగరంలోని కమాన్ కూడలి వద్ద ఉన్న విద్యుల్ బిల్లుల కేంద్రాన్ని తొలగించడం సరికాదని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేంద్రం కమాన్ వద్ద ఉండటం వల్ల గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్, లక్ష్మీనగర్, బోయవాడ, గాయత్రినగర్, షాషా మహల్, కోతిరాంపూర్, పోచమ్మ వీధివాసులకు అందుబాటులో ఉపయోగకరంగా ఉండేదన్నారు. వృద్ధులు, మహిళలు ఇక్కడ విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అనుకూలంగా ఉండేదని తెలిపారు. విద్యుత్ బిల్లుల కేంద్రం తొలగించడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ఈ కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో విద్యుత్ కేంద్రం వచ్చేందుకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలో మంచినీటి ఎద్దడి నివారించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో 15 ఫైనాన్స్ నిధుల కింద రూ.35 లక్షలతో నూతనంగా నిర్మించే పైపులైన్ పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. వేసవిలో ప్రజలు మంచినీటి సమస్యను ఎదుర్కోవద్దనే ఉద్దేశ్యంతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వేణుమాధవ్, కౌన్సిలర్లు వేముల కవితాశేఖర్, చింతల సత్యనారాయణరెడ్డి, ఏఈ ఆసిఫ్, బీఆర్‌ఎస్ నాయకులు కట్ల సుధాకర్, స్వర్గం నర్సయ్య, గున్నాల రమేశ్, అసిఫ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నాపూర్‌లో శ్రీ సీతారాముల కల్యాణం



శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ వాలీసుగ్రీవ ఆలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం వేదోక్తంగా జరిపించారు. వేడుకల్లో ఎమెల్యే రసమయి బాలకిషన్, ధర్మారం, కన్నాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



తిమ్మాపూర్: మండలంలోని గొల్లపల్లి అభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గణపతి హోమం, కుంకుమపూజ, కల్యాణం, బలిప్రదానం, పూర్ణాహుతి జరిపారు. భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేడిపల్లి జనార్దన్‌రెడ్డి, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు నీలం మనోహర్ రెడ్డి, పిట్టల సంపత్, బూట్ల శ్రీనివాస్, రాముడెడ్డి, కష్టారెడ్డి, కమిటీ సభ్యులు, సర్పంచ్ మల్లేతుల అంజయ్య, ఉప సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



అవగాహన సమావేశంలో అధికారులు

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల, గట్టుభూత్కూర్, చర్లపల్లి, గోపాల్‌రావుపల్లి,నర్సింహులపల్లి గ్రామాల్లో శుక్రవారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగుతో కలిగే లాభాలతో పాటు, ప్రభుత్వం అందించే సబ్సిడీ వివరాలను రైతులకు వివరించారు. పెట్టుబడి, దిగుబడితో పాటు సాగు చేస్తే వచ్చే లాభాల గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అధికారులతో పాటు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై డీపీవో విచారణ



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీపీవో

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో సర్పంచ్ ఇంటి అనుమతులతో పాటు ఇతర కార్యక్రమాల్లో ఇబ్బంది పెడుతోందని పలువురు ప్రజావాణిలో చేసిన ఫిర్యాదులపై శుక్రవారం డీపీవో వీరబుచ్చయ్య గ్రాపంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపారు. అనంతరం గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యప్రసన్నతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

శంకరపట్నం: కన్నాపూర్‌లో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి శుక్రవారం మానకొండూర్ ఎమ్మెల్యే రసమయిబాలకిషన్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి రవీందర్‌రెడ్డి, వైద్యాధికారి వేణుగోపాల్, సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.